సాక్షి
సిద్దిపేట
గురువారం : 16 : మే : 2024



పల్లె క్రీడకు పట్టు

కబడ్డీ ఉనికి కోల్పోతున్న దశలో క్లబ్‌ను ఏర్పాటు చేసి వందల సంఖ్యలో క్రీడాకారులను తయారు చేశారు. వివరాలు 8లో ▸



బంక్‌లో కల్తీ పెట్రోల్

పెట్రోల్ బంక్‌లో కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారంటూ వినియోగదారులు ఆందోళనకు దిగారు. వివరాలు 8లో ▸



బేలర్‌తో గడ్డి వృథాకు చెక్

బేలర్ యంత్రాలతో ఎంతో మేలు. గడ్డి వృథా కాకుండా రైతులకు ఉపయోగంగా మారుతున్నాయి. వివరాలు 9లో ▸

అభ్యర్థుల్లో టెన్షన్!

మెతుకుసీమ ఓటరు తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఏ పార్టీని ఆదరించారో... ఎవరిని పార్లమెంట్‌కు పంపుతారో అనే చర్చ జోరుగా సాగుతోంది. గెలుపోటములపై అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. మరోవైపు భారీగా క్రాస్ ఓటింగ్ జరిగిందని ప్రచారం సాగుతోంది. మరి ఎవరికి లాభం.. ఎవరికి నష్టం అనే కోణాల్లో పార్టీనేతలతో పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. అయితే గెలుపుపై ఎవరికి వారు ధీమాగా కన్పిస్తున్నప్పటికీ లోలోపల మాత్రం ఆందోళనగా ఉన్నట్లు తెలుస్తోంది.

– సాక్షి, సిద్దిపేట

- లాభనష్టాలపై లెక్కలు
- గత అసెంబ్లీ ఫలితాలు.. ప్రస్తుత పరిస్థితులపై అంచనా
- ఓటు హక్కు వినియోగంలో పురుషులే అధికం

గుబులు పుట్టిస్తున్న క్రాస్ ఓటింగ్



మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. మూడు ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు వెంకట్రామరెడ్డి, ఎం.రఘునందన్‌రావు, నీలం మధు ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎవరి మద్దతు వారికి ఉండే అవకాశం ఉంది. అయినా అభ్యర్థుల్లో క్రాస్ ఓటింగ్ టెన్షన్ పట్టుకుంది. పట్టణాల్లో, మండల కేంద్రాల్లో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగిందనే చర్చ బలంగా వినిపిస్తోంది. మెదక్ పార్లమెంట్ పరిధిలో బలమైన పునాదులున్న బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనేందుకు బీజేపీ, కాంగ్రెస్‌లు సర్వశక్తులు ఒడ్డారు. అన్ని పార్టీల నుంచి క్రాస్ ఓటింగ్ జోరుగా ఉండటంతో ఫలితం ఎవరి వైపు ఉంటుందో అని జిల్లా రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

పురుషులే అధికంగా..

మహిళల కంటే పురుషులే ఎక్కువగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 6,88,854 మంది ఓటు హక్కును వినియోగించుకోగా మహిళలు 6,83,975 మంది ఓటు వేశారు. మహిళల కంటే 4,879 మంది పురుషులు ఎక్కువ మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరు ఎవరి వైపు ఉంటే ఫలితం వారి వైపే ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి.

గత అసెంబ్లీ ఫలితాలతో బేరీజు

గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు.. ప్రస్తుత పరిస్థితులపై జోరుగా నాయకులు చర్చించుకుంటున్నారు. 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను బీఆర్‌ఎస్ సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, నర్సాపూర్, పటాన్‌చెరు, సంగారెడ్డిలు గెలుపొందగా, మెదక్‌లో కాంగ్రెస్ గెలుపొందింది. మొత్తంగా బీఆర్‌ఎస్‌కు 6.68.955 ఓట్లు, కాంగ్రెస్‌కు 4,20,881, బీజేపీకి 2,11,631 ఓట్లు వచ్చాయి. అప్పటికీ ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో భారీగా మార్పులు వచ్చాయి. దీంతో ఏ పార్టీ గెలుపొందుతుందో అని అంచనాలు వేయలేకపోతున్నారు. గతంలో వచ్చిన ఓట్లకు ఇప్పుడు మైనస్, ప్లస్‌లపై నాయకులతో ఆయా పార్టీల అభ్యర్థులు అంచనాలు వేస్తున్నారు.



చేతివాటం

అకాల వర్షాలు రైతులను హడలెత్తిస్తుంటే మరోవైపు ధాన్యం రవాణా పేరుతో ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. వానలకు ధాన్యం తడిస్తే ధర ఎక్కడ తగ్గిస్తారోననే ఆందోళనతో కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్న ఆత్రుత కాస్తా.. ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది తమకు అనుకూలంగా మార్చుకొని అందినకాడికి దండుకుంటున్నారు. ఇస్తే సరే.. లేకుంటే ఇబ్బందులు తప్పదని భావించిన రైతులు అడిగినంత ఇచ్చుకోవాల్సిన పరిస్థితి. అక్రమార్కులకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

ధాన్యం రవాణా పేరుతో దోపిడీ

- లారీకి రూ. రెండు వేలు వసూలు
- రైతులు ఇవ్వకుంటే కేంద్రాల్లోనే ధాన్యం
- ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌తో కేంద్రాల నిర్వాహకులు కుమ్మక్కు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఒక వైపు తేమ శాతం పేరుతో ప్రతి 40 కిలోల బస్తాకు 2.5 కిలోలు కోత విధిస్తున్నారు. ఇది చాలదన్నట్టు తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వచ్చే లారీల సిబ్బంది రైతుల నుంచి ముడుపులు తీసుకుంటుంది. ఒక్కో ట్రిప్పునకు రూ. రెండు వేల వరకు వసూలు చేస్తుంది. డబ్బులు ఇవ్వని పక్షంలో రైతుల ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి తీవ్ర జాప్యం చేస్తుంది. దీంతో చేసేదేమీ లేక రైతులు అడిగినంత ఇచ్చుకోక తప్పడం లేదు.

ఈ యాసంగి కొనుగోలు సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 1.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోకి వస్తుందని జిల్లా అధికార యంత్రాంగం అంచనా వేసింది. ఈ మేరకు ప్రణాళికను రూపొందించింది. 211 చోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 63,400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా 60 వేల మెట్రిక్ టన్నుల లోపే కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ యాసంగి సీజన్‌లో ఎండల తీవ్రతకు ధాన్యం దిగుబడి పడిపోయింది. కీలక దశలో సరిగ్గా నీళ్ల అందకపోవడంతో తాలు ఎక్కువగా వచ్చింది. ఈ కారణంగానే 1.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని భావించినా కేవలం 1.20 లక్షల మెట్రిక్‌టన్నులకు మించి కేంద్రాలకు వచ్చే అవకాశాలు లేవని అధికారులు భావిస్తున్నారు.

రెండు సెక్టార్లుగా విభజన

ధాన్యం తరలించే కాంట్రాక్టును జిల్లా పౌరసరఫరా సంస్థ జిల్లాను రెండు సెక్టార్లుగా విభజించారు. నారాయణఖేడ్, అందోల్ అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని ధాన్యాన్ని తరలించేందుకు ఒక సెక్టార్‌గా, సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని ధాన్యాన్ని రవాణా చేసే కాంట్రాక్టును మరొకరికి అప్పగించారు. ఇలా ధాన్యాన్ని తరలించినందుకు పౌరసరఫరాల సంస్థ సంబంధిత ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టరుకు నిర్ణీత మొత్తంలో చెల్లిస్తుంది. కానీ లారీల సిబ్బంది మాత్రం తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తుండం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ ముడుపుల వ్యవహారానికి కొన్ని కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు కూడా సహకరిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా సరే ముడుపులు ఇచ్చేందుకు నిరాకరిస్తే ధాన్యాన్ని తరలించడానికి మరింత సమయం పడుతుందని చెబుతున్నారు. అసలే అకాల వర్షాలతో ధాన్యం తడిసి పోతుంది. దీన్ని ఆసరాగా చేసుకుని లారీల నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు.

తూకం వేసే వరకే రైతు బాధ్యత

నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి కాంటా వేయడం వరకే రైతుల బాధ్యత. ఆతర్వాత లారీల్లో లోడ్ చేసుకుని.. కేంద్రం నుంచి మిల్లులకు తరలించాల్సింది కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే. అయితే త్వరగా పంట అమ్ముకోవాలనే రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒకవేళ ఒక ట్రిప్పులో ఇద్దరు, ముగ్గురికి సంబంధించిన ధాన్యం ఉంటే ఒక్కొక్కరు రూ.వెయ్యి చొప్పును ఇచ్చుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ ముడుపుల విషయం బయటకు చెబితే తరలింపులో మరింత జాప్యం అవుతుందనే భయంతోనే నిర్వాహకులను ప్రశ్నించడం లేదు.

ఆరోపణలు అవాస్తవం..

లారీల సిబ్బంది రైతుల వద్ద ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణల్లో నిజం లేదు. నాతో పాటు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి జిల్లా అంతటా తిరుగుతున్నాం. మాకు ఎక్కడ కూడా ఫిర్యాదు అందలేదు. ఎన్నికల కారణంగా ధాన్యం తరలించడం కొంత ఆలస్యమైతే కావచ్చు. కానీ రైతుల వద్ద ముడుపులు వసూలు చేయడం లేదు.

కొండల్‌రావు,
డీఎం సివిల్ సప్లయి సంస్థ

న్యూస్‌రీల్

రైతులకు డ్రోన్ పంపిణీ



డ్రోన్ పంపిణీ చేస్తున్న ఇఫ్కో సంస్థ ప్రతినిధులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఇఫ్కో సంస్థ బుధవారం మండల పరిధిలోని మాచాపూర్ రైతులకు డ్రోన్ పంపిణీ చేసింది. పంటలపై మందుల పిచికారీ కోసం అందజేశారు. ఈ సందర్భంగా రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం జిల్లా చైర్మన్ చంద్రబాబు మాట్లాడుతూ రూ.16 లక్షల విలువగల డ్రోన్, ఎలక్ట్రికల్ ఆటోను చిన్నకోడూరు సంస్థకు అప్పగించారన్నారు. రైతులకు ఆదాయం పెంచడానికి ఈ డ్రోన్ ఉపయోగపడుతుందన్నారు కార్యక్రమంలో ఎఫ్‌పీఓ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎండీ కృపాకర్, కృష్ణ, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రాండ్ టెస్ట్‌లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్–1 అభ్యర్థులకు ప్రిలిమ్స్ గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. పరీక్షలు ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు సిద్దిపేట బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కృష్ణదయాసాగర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి వచ్చే నెల 3 వరకు జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే.. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ గ్రాండ్ టెస్ట్‌లు ఆఫ్‌లైన్‌లో బీసీ స్టడీ సర్కిల్ సైదాబాద్‌లో ఈ నెల 23, 26, 28, 30, జూన్ 2, 4, 6, 8, 10, 12తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు సిద్దిపేట బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం (99666 73095, 08457-224941)లో సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

వైద్యాధికారి శ్రీనివాస్



ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

కొండపాక(గజ్వేల్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. దుద్దెడలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వైద్య సేవలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పుట్ట శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్నందునా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలన్నారు. సకాలంలో వైద్యులు ఆస్పత్రికి రావాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, వైద్యులు శ్రీధర్, సంధ్య ఉన్నారు.

లారీల కొరత.. రైతుల వెత



చిట్కుల్‌లో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడం, తూకం వేసిన ధాన్యాన్ని లారీల్లో తరలించకపోవడంతో అసహనానికి గురైన రైతులు బుధవారం మండల పరిధిలోని చిట్కుల్‌లో మెదక్– జోగిపేట ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ షేక్ మహబూబ్ రైతులకు నచ్చజెప్పి తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. అయినా రైతులు ఆందోళన విరమించలేదు. ఉన్నతాధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని తేల్చిచెప్పారు. చివరికి పీఏసీఎస్ సిబ్బంది హామీ ఇవ్వడంతో విరమించారు. కార్యక్రమంలో రైతులు పాపయ్య, నాగరాజు, సత్తయ్య, నర్సింలు, కిష్టయ్య, మల్లేశం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహిళా సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మాజీ పేర్కొన్నారు. జూలై 31వ తేదీలోగా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 6 నుంచి 18 ఏళ్ల లోపు బాల బాలికలు అర్హులన్నారు.

డీడబ్ల్యూఓ సావిత్రి సేవలు అమోఘం



సావిత్రిని సన్మానిస్తున్న అదనపు కలెక్టర్లు, అధికారులు

సిద్దిపేటరూరల్: డీడబ్ల్యూఓగా పనిచేసిన సావిత్రి సేవలు అమోఘమని అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ మాట్లాడుతూ డీడబ్ల్యూఓ సావిత్రి జిల్లాలో 2 నెలలు మాత్రమే పనిచేసినప్పటికీ అందరి మన్ననలు పొందారన్నారు. తన సర్వీసులో అధికభాగం ఆసిఫాబాద్, ములుగు, ఖమ్మం లాంటి ఆదివాసీ జిల్లాల్లో పని చేసి పేద ప్రజలకు సేవలందించారన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన జిల్లా సంక్షేమ అధికారి కె.సావిత్రి మాట్లాడుతూ జిల్లాలో పనిచేయడం సంతోషంగా ఉందని, ఉన్నతాధికారులు పూర్తి సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు డీఆర్‌డీఏ జయదేవ్, బీసీ వెల్ఫేర్ అధికారి సరోజ, డీపీఓ దేవకీదేవి, ఎస్‌సీ సంక్షేమ శాఖ అధికారి కవిత, డీపీఆర్‌ఓ రవికుమార్, ల్యాండ్స్ ఏడీ వినయ్, మార్కెటింగ్ ఏడీ నాగరాజు, సివిల్‌సప్లై డీఎం హరీష్, పశు సంవర్ధక, హార్టికల్చర్, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి, ఇన్‌చార్జి డిడబ్ల్యూఓ శారద, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

పొగగొట్టం ఎక్కి కార్మికుడి నిరసన

- వేతన బకాయి చెల్లించాలని డిమాండ్
- యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటూ మండిపాటు



పొగగొట్టం ఎక్కి నిరసన తెలుపుతున్న కార్మికుడు రమేశ్

జహీరాబాద్: వేతన బకాయిలు చెల్లించే విషయంలో జాప్యమవుతుందని బుధవారం మండలంలోని కొత్తూర్(బి)లో ఉన్న ట్రైడెంట్ చక్కెర కర్మాగారానికి చెందిన కార్మికుడు రమేష్ పొగగొట్టం ఎక్కి నిరసన తెలిపాడు. 11 నెలలుగా వేతనాలివ్వడం లేదని, ఈనెల 22న కుమార్తె వివాహం ఉందని, చేతిలో చిల్లిగవ్వ లేక ఆందోళన వ్యక్తం చేశారు. 165 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నా యాజమాన్యం మాత్రం వేతనాలు చెల్లించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.3కోట్ల వేతనాలతో పాటు పాత బకాయిలు కలుపుకొని రూ.5కోట్ల మేర చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆయా శాఖల అధికారులు ఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు ఎంజీ రాములు, కార్మికులతో కలిసి డీసీఎల్ రవీందర్‌రెడ్డి, ఏసీఎల్ యాదయ్య, తహసీల్దార్ రవీందర్, సీఐ రవి, ఎస్‌ఐ నరేష్, మాజీ సర్పంచ్ జగన్మోహన్‌లు సమావేశమయ్యారు. సమస్య కొలిక్కి రాకపోవడంతో రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి కర్మాగారం వద్దకు చేరుకుని అధికారులతో కలిసి ఆయన చర్చించారు. అనంతరం కలెక్టర్‌తో ఫోన్‌లో ఈ విషయాన్ని వివరించారు. యాజమాన్యంతో వారంలో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. పొగ గొట్టం ఎక్కిన కార్మికుడి కుమార్తె పెళ్లి ఈనెల 22న ఉన్నందున రూ.2లక్షలు, ఈనెల 17న మరో కార్మికుడు శేఖర్ కుమార్తె పెళ్లి ఉన్నందున అతడికి కూడా రూ.2లక్షలు చెల్లించేందుకు అధికారులు హామీ ఇచ్చారు. కాగా, ఇదే విషయాన్ని ఫోన్ ద్వారా రమేష్‌కు తెలపగా.. ఫైర్ సిబ్బంది సహాయంతో కిందకు దిగారు. వైద్యపరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

భారతీయ సంస్కృతి గొప్పది

- విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి
- సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న సంపూర్ణేష్‌బాబు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారతీయ సంస్కృతి చాలా గొప్పదని, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రముఖ సినీ నటులు సంపూర్ణేష్‌బాబు, సిల్వర్ సురేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యాసమహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలసంస్కార్ శిక్షణ ముగింపు కార్యక్రమం పట్టణంలోని విపంచి కళా నిలయంలో నిర్వహించారు. ముందుగా విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను ఆకర్షించాయి. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయిన సినీ నటులు సంపూర్ణేష్‌బాబు, సిల్వర్ సురేష్, ప్రముఖ జర్నలిస్ట్ దేవికరెడ్డిలు మాట్లాడుతూ సిద్దిపేట అన్ని రంగాల్లో పురోగమించడం హర్షణీయమన్నారు. బాల్యంలోనే నచ్చిన అంశాన్ని ఎంపిక చేసుకొని శిక్షణ, సాధనలతో రాణిస్తే జాతీయస్థాయిలో గుర్తింపు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. చదువుతోపాటు విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులను అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి అంజయ్య, జిల్లా టీఎన్జీవోల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరమేశ్వర్, విక్రంరెడ్డి, జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, యూటీఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు లక్కిరెడ్డి విజయ రెడ్డి, బాల సంస్కార్ కోర్స్ డైరెక్టర్ తోట సంధ్య, ప్రముఖ యోగా శిక్షకులు తోట సతీష్, తపస్ జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల నృత్యం

ఉరకలెత్తే ఉత్సాహం.. ఆటల్లో ప్రోత్సాహం

- వేసవి క్రీడలకు అనూహ్య స్పందన
- విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి
- రామంచ, ఇబ్రహీంనగర్‌లో ఉచిత శిక్షణ



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం.. శారీరక దృఢత్వం పెంపొందించడంలో ఆటలదే ప్రధానపాత్ర. పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు తమ నైపుణ్యాలకు పదును పెట్టేందుకు ఈ శిక్షణా శిబిరాలు చక్కని అవకాశం. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్ ఆవరణలో, రామంచ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ క్రీడాకారులకు ఉచిత వాలీబాల్ క్రీడా శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామీణ క్రీడాకారులకు ఈ శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉచిత శిక్షణ ఈ నెల 1న ప్రారంభం కాగా ఈ నెల 30 వరకు కొనసాగనుంది. ఈ శిక్షణ ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 వరకు ఉంటుంది. ఈ ఉచిత శిక్షణను ఇబ్రహీంనగర్‌లో 60 మంది హాజరవుతున్నారు. రామంచలో 100 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

మెలకువలపై శిక్షణ..

విద్యార్థులకు రన్నింగ్, వామప్, వాలీబాల్ క్రీడకు సంబంధించిన మెలకువలపై శిక్షణ ఇస్తున్నారు. వీటితో పాటు వాలీబాల్ క్రీడకు సంబంధించిన నైపుణ్యాలు అప్పర్ హామ్ పాస్, అండర్ హామ్ పాస్, లోయర్ హామ్ పాస్, సింపుల్ సర్వీస్, సైడ్ హామ్ సర్వీస్, జంప్ సర్వీస్, సెట్టింగ్, డిఫెన్స్, స్పైకింగ్, సైడ్ ఫ్రంట్ డైవ్స్, స్టాండింగ్, రోటేషన్ సిస్టమ్ తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నారు.

ఆసక్తి పెరుగుతోంది



గ్రామాల్లో వేసవి క్రీడా శిబిరాలను ప్రతి ఏటా నిర్వహించాలి. మాకు నచ్చిన ఆట ఎంచుకుని పోటీల్లో రాణిస్తాం. ప్రస్తుత సెలవుల్లో ఎక్కడికి వెళ్లకుండా ఇక్కడే నేర్చుకుంటున్నాం. ఈ శిక్షణతో క్రీడలంటే ఆసక్తి పెరుగుతోంది.

– దివ్య, ఇబ్రహీంనగర్

సెల్ ఫోన్‌కు దూరం..



వేసవి శిబిరాల్లో ఆటలాడుతూ ఎంజాయ్ చేస్తున్నాం. ఇప్పుడు సెల్ ఫోన్‌కు దూరంగా ఉంటున్నాం. ఏపనైనా ఉత్సాహంగా చేస్తున్నాం. వ్యాయామ ఉపాధ్యాయుడు నేర్పించే అంశాలను సాధన చేస్తున్నాం. వాలీబాల్‌క్రీడలో రాణిస్తా.

–అక్షిత్ ప్రణయ్, ఇబ్రహీంనగర్

ఆసక్తి చూపుతున్నారు



వేసవి క్రీడా శిబిరాల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థులు రోజు ఆటలు ఆడితే చురుగ్గా ఉంటారు. సెల్ ఫోన్‌కు దూరంగా ఉండి ఆరోగ్యంగా మారుతారు. క్రీడల్లో విద్యార్థులు పట్టు సాధించేలా శిక్షణ ఇస్తున్నాం.

– గుండి ప్రవీణ్, పీఈటీ, ఇబ్రహీంనగర్

సరదాగా.. సందడిగా..

పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మూడు నెలలపాటు అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, రాజకీయ నేతలు బిజీబిజీగా గడిపారు. సోమవారం పోలింగ్ ముగియగా బుధవారం సమయం దొరకడంతో వీరంతా కాస్త రిలాక్స్ అయ్యారు. ఎలాగైనా గెలుస్తామనే ధీమాతో కొందరు నాయకులు పార్టీ కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కొంతమంది తమ కుటుంబ సభ్యులతో, మనవళ్లు, మనవరాళ్లతో సంతోషంగా గడిపారు. మరికొందరు స్నేహితులతో కలిసి టూర్లకు వెళ్లారు.

రఘునందన్.. ఆనందం



దుబ్బాక: మనువరాలికి సైకిల్ నేర్పిస్తున్న రఘునందన్‌రావు

మైనంపల్లి.. టూరెల్లి



చిన్నశంకరంపేట(మెదక్): బెంగుళూర్‌లో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, హన్మంతరావు

మనవరాలితో సునీత



మనువరాలితో స్టడీ గేమ్ ఆడుతూ సరదాగా గడుపుతున్న ఎమ్మెల్యే సునీత - శివ్వంపేట (నర్సాపూర్)

కార్యకర్తలతో సురేశ్ షెట్కార్



నారాయణఖేడ్: ఇంట్లో కార్యకర్తలు, ప్రజలతో చర్చిస్తున్న సురేశ్ షెట్కార్

'మధు'రమైన క్షణం



పటాన్‌చెరు: వివాహ వార్షికోత్సవం సందర్భంగా నీలం మధును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

చైనాకు మదన్‌రెడ్డి



కొడిపల్లి(నర్సాపూర్): స్నేహితులతో కలిసి చైనా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

క్లుప్తంగా

అధిక లాభాలు అంటూ ఆశ చూపి..

- ములుగులో సైబర్ మోసం

ములుగు(గజ్వేల్): పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని సైబర్ నేరగాడి మాటలను నమ్మి ఓ వ్యక్తి మోసపోయాడు. పోలీసుల కథనం మేరకు.. ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాధితుడికి గుర్తు తెలియని సైబర్ నేరగాడు అధిక ఆదాయం వస్తుందని పెట్టుబడికి సంబంధించిన లింకును పంపించాడు. ఆ లింకును ఓపెన్ చేయగా డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించారు. ఇది నమ్మిన బాధితుడు రూ.1,98,000 పంపించాడు. తదుపరి ఆ లింకును ఓపెన్ చేసి చూడగా బ్లాక్ చేసి ఉంది. బాధితుడు వెంటనే సైబర్ సెల్ జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ వచ్చి దరఖాస్తు ఇవ్వగా ఏసీపీ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మహిళపై దాడి ఘటనలో...

- వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష

చేగుంట(తూప్రాన్): మహిళపై దాడి చేసిన ఘటనలో నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ మెదక్ అడిషనల్ జిల్లా జడ్జి జితేందర్ బుధవారం తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వడియారం గ్రామానికి చెందిన మర్రికింది శ్యామలను ఆమె భర్త మర్రికింది నగేశ్ 2023 ఆగస్టు నెలలో కత్తితో చంపుతానని బెదిరిస్తూ దాడి చేశాడు. దాడిలో శ్యామలకు గాయాలు కాగా, దాడిని ఆపడానికి వచ్చిన బంధువులను కర్రతో గాయపరిచాడు. శ్యామల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా నేరం రుజువు కావడంతో నగేశ్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు. ఈ కేసులో రామాయంపేట సీఐ వెంకటేశ్ నేర పరిశోధనలో పాల్గొనగా చేగుంట పోలీస్ సిబ్బంది సహకారం అందించినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మునిపల్లి(అందోల్): వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిన్నచల్మెడ గ్రామంలో చోటు చేసుకుంది. బుదేరా ఎస్ సురేశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఒగ్గు అంజమ్మ (50), భర్త సంగయ్యకు మధ్య మనస్పర్థలు రావడంతో ఏడాది కాలంగా తల్లిగారి ఊరైన మగ్దుంపల్లిలో ఉంటుంది. ఈ క్రమంలో బుధవారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి మాణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పల్లె క్రీడకు పట్టు

కబడ్డీ ఆటలో రాణిస్తున్న యువత

- పోలీసు ఉద్యోగాలకు ఎంపికవుతున్న క్రీడాకారులు
- జాతీయస్థాయిలో గుర్తింపు
- వేసవి శిక్షణతో యువత నైపుణ్యాలకు మెరుగు



కబడ్డీలో శిక్షణ పొందుతున్న యువత



క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న కోచ్ కృష్ణ

హుస్నాబాద్‌రూరల్: పల్లె క్రీడ కబడ్డీ ఉనికి కోల్పోతున్న దశలో హుస్నాబాద్ క్రీడాకారుడు హోంగార్డు మడక కృష్ణ కబడ్డీ క్లబ్‌ను ఏర్పాటు చేసి వందల సంఖ్యలో క్రీడాకారులను తయారు చేసి పల్లె క్రీడకు పట్టు సాధించాడు. క్రికెట్ మోజులో యువత అందరూ బ్యాట్, బాలు పట్టుకొని గ్రౌండ్‌లో ఫోర్లు, సిక్స్‌లు కొడుతు ఆనందించే యువత ప్రాచీన కబడ్డీ క్రీడను ఒక దశలో మరిచిపోయారు. కబడ్డీ ఆటతోనే నిత్యం వ్యాయామం జరిగి శారీరక దృఢత్వం అలవడి ఆరోగ్యంగా ఉండటంతోపాటు పరుగు పెట్టేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. కబడ్డీ క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఆటలు ఆడటంతోపాటు 13 మంది పోలీసు ఉద్యోగాలు, ఐదుగురు సైనికులు, 40 మంది పాఠశాలలో వ్యాయమ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు చేస్తున్నారు. క్రీడా మైదానం నుంచి ఆర్మీలో చేరి దేశ భద్రతలో పాలు పంచుకుంటున్నారు.

వేసవి శిక్షణ శిబిరం..

పాఠశాలలకు ప్రభుత్వం వేసవి సెలువులు ఇవ్వడంతో చదువులు మానేసిన పిల్లలు సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి వెళ్తుంటారు. పిల్లలను ప్రతిభావంతులను చేయాలని, పిల్లల్లో దాగిన నైపుణ్యాలను వెలికి తీయడం కోసం జిల్లా స్థాయిలో అధికారులు వివిధ రంగాల్లో వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. పోతారం(ఎస్) గ్రామంలో ప్రతీ ఏటా కబడ్డీ శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినప్పటికీ ఈసారి ఇవ్వలేదు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సహకారంతో కృష్ణ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణను ఏర్పాటు చేసి 40 పిల్లలకు కబడ్డీలో శిక్షణ ఇస్తున్నారు. కబడ్డీ కోచ్ కృష్ణ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మన ప్రాంతం పిల్లలను క్రీడాకారులను తయారు చేయాలని ఆలోచనతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. గ్రామంలోని దాతలు ముందుకొచ్చి క్రీడాకారులకు అల్పాహారం ఇచ్చి ప్రోత్సహించడంతో మరుగునపడిన కబడ్డీ క్రీడా మళ్లీ పల్లెలో పట్టు బిగిస్తుంది.

కబడ్డీతోనే పోలీసు ఉద్యోగం



మా ఊరులో కబడ్డీ పోటీలు పెడితే వెళ్లి చూసేవాడిని. తర్వాత మడక కృష్ణ మా ఊరు పోతారం(ఎస్)లోనే ఉండి కబడ్డీ క్లబ్ ఏర్పాటు చేసి చాలా మందికి శిక్షణ ఇచ్చాడు. కబడ్డీ క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు కూడా వెళ్లాను. 2015లో పోలీసు ఉద్యోగాల నియమాకంలో ఫిట్‌నెస్ విభాగంలో 75 మార్కులకు 58 మార్కులు రావడంతో జిల్లాలో 2వ స్థానములో ఎంపికయ్యాను. కబడ్డీ ఆట నాకు ఉద్యోగము తెచ్చిపెట్టింది.

– కత్తుల రఘు, కానిస్టేబుల్

క్రీడా నైపుణ్యమే జవాన్‌ను చేసింది



అందరూ క్రికెట్ ఆడుతుంటే మా ఊరులో కబడ్డీ టోర్నీమెంట్ పెట్టేవారు. యువత క్రికెట్ మోజులో ఉంటే మా ఊరు యువత మాత్రం కబడ్డీలో ప్రాక్టీస్ చేసి పొరుగు జిల్లాలో ఎక్కడ టోర్నమెంట్ జరిగినా పోతారం(ఎస్) జట్టు పాల్గొని బహుమతి గెలిచేది. నేను మూడు జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్నాను. 2020లో ఆర్మీ ఉద్యోగం సాధించి బెంగుళూరులో శిక్షణ పొందిన తర్వాత రెండేళ్ల నుంచి జమ్ము కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నాను.

– యువేందర్, ఆర్మీ జవాన్

యువత ఉద్యోగాలు సాధించాలని



నేను పదేళ్ల నుంచి కబడ్డీలో శిక్షణ ఇస్తున్నాను. పోతారం (ఎస్) గ్రామస్తులు సహకారం అందిస్తున్నారు. వందల మంది క్రీడాకారులు తయారయ్యారు. పోలీసు ఉద్యోగాలు, ఆర్మీ జవాన్‌లు, పీఈటీలుగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఆటలు ఏకాగ్రతను కలిగించడం వల్ల చదువులోనూ రాణిస్తున్నారు. ఆటలో ప్రతీ క్రీడాకారుడు విజయం కోసమే ఆడుతాడు. మాకు జిల్లా అధికారులు వేసవి శిక్షణ శిబిరం ఇవ్వకపోయినా మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో పిల్లలకు శిక్షణ ఇస్తున్నాను.

– మడక కృష్ణ, కబడ్డీ కోచ్

అధికారుల కళ్లు గప్పి ఉడాయింపు

- అక్రమంగా మట్టి తరలిస్తున్న కొందరు
- పట్టుకొని తీసుకెళ్తుండగా వాహనాలతో పారిపోయిన వైనం



అధికారులు పట్టుకున్న వాహనాలు

వట్‌పల్లి(అందోల్): అక్రమంగా చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్ వాహనాలను ఇరిగేషన్ అధికారులు పట్టుకొని తరలిస్తున్న క్రమంలో అధికారుల కళ్లుగప్పి వాహనాలతో అక్రమార్కులు ఉడాయించిన ఘటన బుధవారం మండల పరిధిలోని బిజిలీపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం మేరకు.. గ్రామంలోని కింది చెరువులో ఎటువంటి అనుమతి లేకుండా కొందరూ అక్రమార్కులు పెద్ద ఎత్తున చెరువు మట్టిని తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఇరిగేషన్ ఏఈ నిషిత ఆదేశాల మేరకు అక్కడికి చేరుకొని జేసీబీతోపాటు రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. పట్టుబడిన వాహనాలను తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మట్టి అక్రమార్కులు వాహనాలతో తప్పించుకుపోయినట్లు తెలిపారు. గ్రామ చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో వట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

లారీని వెనుకకు తీస్తూ..

- క్లీనర్ మీది నుంచి వెళ్లిన డ్రైవర్
- తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి

పటాన్‌చెరు టౌన్: లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో క్లీనర్ మృతి చెందిన ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. కర్ణాటక గుల్బర్గాకు చెందిన డ్రైవర్ వీరప్పతో క్లీనర్‌గా బాలయ్య మంగళవారం సాయంత్రం లారీలో షుగర్ లోడ్ తీసుకొని పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమకు వచ్చారు. పరిశ్రమలో లోడ్‌ను అన్‌లోడ్ చేశారు. అనంతరం డ్రైవర్ లారీని వెనుకకు తీస్తూ క్లీనర్ బాలయ్య పైనుంచి వెళ్లాడు. దీంతో తీవ్ర గాయాలై బాలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ వీరప్పతోపాటు పరిశ్రమ నిర్లక్ష్యం కారణంగానే తన తండ్రి మృతి చెందాడని మృతుడి కుమారుడు మాణిక్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బంక్‌లో కల్తీ పెట్రోల్

- నీళ్లు ఉన్నాయంటూ వినియోగదారుల ఆందోళన
- ములుగులో కలకలం



పెట్రోల్ బంక్ వద్ద ఆందోళన చేస్తున్న వినియోగదారులు



బాటిల్‌లో నీటితో కూడిన పెట్రోల్‌ను చూపుతున్న బాధితుడు

ములుగు(గజ్వేల్) : పెట్రోల్ బంక్‌లో కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారంటూ వినియోగదారులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ములుగు గ్రామ రోడ్డుపైన ఉన్న సరస్వతీ పెట్రోల్ బంక్‌లో ములుగుకు చెందిన వెంకటస్వామి బైక్‌లో పెట్రోల్ పోసుకున్నాడు. నీటితో పెట్రోల్ కల్తీ జరిగి ఉండటంతో కొద్ది సేపటికే బైక్ ఆగిపోతూ మొరాయించింది. దీంతో పెట్రోల్ కల్తీ అయిందని భావించి పెట్రోల్ బంక్‌వద్దకు వెళ్లాడు. కల్తీ చేస్తున్నారంటూ బంక్ నిర్వాహకులను నిలదీసి గొడవపడ్డాడు. బైక్‌లో పోసిన పెట్రోల్‌ను వారి ముందే బాటిల్‌లోకి తీయ గా మూడో వంతూ నీళ్లే ఉన్నాయి. పలువురు వినియోగదారులతో కలిసి పెట్రోల్ బంక్ ముందర ఆందోళనకు దిగారు. కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్న బంక్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గొడ వ విషయం తెలిసిన ములుగు ఏఎస్ఐ శంకర్‌తో పాటు పోలీసులు పెట్రోల్ బంక్ వద్దకు చేరుకున్నారు. చట్టబద్ధంగా ఫిర్యాదు చేసుకోవాలని ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

చెప్పుల దుకాణంలో అగ్ని ప్రమాదం

సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం



చెప్పుల దుకాణంలో మంటలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : చెప్పుల దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగిన రామచంద్రాపురం పట్టణంలోని అశోక్‌నగర్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో నివాసముండే రాజు అశోక్‌నగర్‌లో 15 ఏళ్లుగా చెప్పుల దుకాణం నడుపుతున్నాడు. మంగళవారం ఉదయం 9 గంటలకు దుకాణం తెరిచి రాత్రి 9.30 గంటలకు దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి సమయంలో దుకాణంలో మంటలు రావడంతో స్థానికులు రాజుకు సమాచారం ఇచ్చారు. రాజు, స్థానికులు మంటలార్పే ప్రయత్నం చేశారు. దుకాణంలోని మీటర్ పేలి రాజు కాలుపై పడటంతో గాయమైంది. మంటలు పక్కనే ఉన్న కూరగాయల దుకాణంకు సైతం అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దుకాణంను బుధవారం కార్పొరేటర్ పుష్ప నగేశ్ సందర్శించారు. బాధితుడికి తన వంతు ఆర్థిక సాయం అందించారు.

సరదాగా వెళ్లి.. గుండెపోటుతో మృతి

- గోవాలో చనిపోయిన మండల వాసి

మనోహరాబాద్(తూప్రాన్): సరదాగా స్నేహితులతో కలిసి గోవాకు వెళ్లిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పోతారం గ్రామానికి చెందిన మస్కూరి కృష్ణ(45) ఈ నెల 13న స్నేహితులతో కలిసి గోవాకు వెళ్లాడు. గోవాలో ఉండగానే బుధవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తూప్రాన్ పట్టణంలో ఓ గ్రానైట్ షాప్ నిర్వహిస్తున్న కృష్ణ అకాల మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

వృద్ధురాలిని తప్పించబోయి..



రోడ్డుపై అడ్డంగా పడిపోయిన కారు

- అదుపుతప్పిన కారు
- డివైడర్ దాటుకొని మరో కారును ఢీ
- బెలూన్స్ తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం

కొండపాక(గజ్వేల్): రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని తప్పించబోయిన కారు అదుపు తప్పి డివైడర్ అవతలి వైపునకు ఎగిరి పడి మరో కారును ఢీ కొట్టింది. ఈ ఘటన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కొడకండ్ల గ్రామంలో రాజీవ్ రహదారిపై బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు అతివేగంగా ఓ కారు వెళ్తుంది. కారు వస్తున్న క్రమంలో కొడకండ్లలో ఓ వృద్ధురాలు రోడ్డు దాటుతుంది. ఇది గమనించిన కారు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో అదుపుతప్పింది. డివైడర్‌ను దాటుకొని వెళ్లి మరో కారు ఢీకొట్టింది. కార్లకు ఉన్న బెలూన్స్ ఓపెన్ కావడంతో రెండు కార్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో వాహనాల్లో ఉన్న ఎవరికీ గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా పడిన కారును తీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై పేర్కొన్నారు.

ఉల్లి సాగుపై ఆసక్తి

- సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు
- జిల్లాలో 1,247 ఎకరాల్లో సాగు
- ఉద్యానవన శాఖ జిల్లా అధికారి సోమేశ్వర్ రావు





జహీరాబాద్ టౌన్: ఆరోగ్యానికి తల్లిలా మేలు చేసే ఉల్లికి మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. రైతులకు అన్ని కాలాల్లో లాభాలను తెచ్చిపెడుతోంది. వానాకాలం, యాసంగి, వేసవి పంట సాగు చేసుకోవచ్చు. ప్రస్తుతం జిల్లాలో యాసంగి పంటగా అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. జిల్లాలో 1247 ఎకరాల్లో సాగు అవుతుంది. జహీరాబాద్ ప్రాంతంలోనే 234 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి సోమేశ్వర్ రావు పేర్కొన్నారు. ఉల్లిలో రకాలు, సాగు విధానం, దిగుబడుల గురించి ఆమె పలు సూచనలు, సలహాలు చేశారు.

ఉల్లి రకాలు

ఉల్లిలో పలు రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. పూసా రెడ్, ఆర్కని కేతస్, అర్క కల్యాణ్, బళ్లారి రెడ్, వైట్ ఆనియన్, అగ్రిఫౌండ్, తెలుపు రకాలో పూసా వైట్ రౌండ్, భీమా శ్వేత, భీమా శుభ్ర, రాంపూర్ రెడ్ తదితర రకాలు మార్కెట్‌లో లభిస్తాయి.

విత్తే సమయం:

- వానకాలం పంటగా జూన్, జూలై నుంచి అక్టోబర్, నవంబర్ వరకు, యాసంగి పంటగా నవంబర్, డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు సాగు చేసుకోవచ్చు.
- వేసవి పంటగా జనవరి, ఫిబ్రవరి నెలలో నారు నాటువచ్చు. వాతావరణంలో మార్పుల్లేని ప్రాంతాల్లో ఉల్లి ఎదుగుదల బాగుటుంది.
- ఉల్లిసాగుకు నీరు నిల్వని సారవంతమైన మేర నేలలు అనుకూలం. ఉప్పు, చౌడు, క్షారత్వం, నీరు నిల్వ ఉండే నేలలు పనికిరావు. రెండు మూడు సార్లు దుక్కి దున్ని పొలాన్ని చదును చేయాలి.
- 30 సెంటీమీటర్ల బోదెలు తీసి రెండు వైపుల నారు నాటుకోవాలి. ఎకరానికి 30 నుంచి 40 కిలోల వరకు విత్తనం అవసరమవుతుంది.
- నాటిన 60 రోజుల వరకు 12 నుంచి 15 రోజుల వ్యవధిలో నాలుగైదు తడులు ఇవ్వాలి. గడ్డ ఉరే దశలో 6 నుంచి 7 రోజుల వ్యవధిలో ఎనిమిది తడులు ఇవ్వాలి. కోతకు 15 రోజులకు ముందు నీరు పెట్టడం ఆపాలి.

తెగుళ్లు-నివారణ :

- ఉల్లి పంటకు ప్రధానంగా తామర పురుగులు, ఆకుమచ్చ తెగులు, పచ్చ పురుగులు ఆశించి పంటకు నష్టాన్ని కలిగిస్తుంటాయి.
- తామర పురుగు ఆకు అడుగుభాగంలో చేరి రసాన్ని పీల్చడం వల్ల ఆకులపై తెల్లటి మచ్చలు, కాడలపై ఊదా రంగు మచ్చలు ఏర్పడుతాయి.
- తామర పురుగుల నివారణకు డైమిథోయేట్ లేదా పిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లు, 3 గ్రాముల మాంకోజెబ్ లీటరు నీటిలో కలిపి పది రోజుల వ్యవధితో పిచికారీ చేయాలి.
- ఆకుమచ్చ పురుగులు ఆశించడం వల్ల ఆకులపై ఉదారంగు మచ్చలు ఏర్పడి ఎండిపోతాయి.
- ఈ తెగుల నివారణకు క్లోరోథలోనిల్ 2.5 గ్రాములు లేదా కార్బండిజమ్ 1 గ్రామ్ లేదా మాంకోజెబ్ 2 గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలి.
- మచ్చ పురుగులు ఆకులను తిని నష్టం కలిగిస్తాయి. కార్బరిల్ 3 గ్రాములు లేదా ప్రొఫెనోఫాస్ 2 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- కుళ్లు తెగులు నివారణకు మెటలాక్సిల్, మాంకోజెట్ 3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.